

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు





4

## ఇదీ కుట్రేనా?

**పోలవరం, టీటీడీ దస్త్రాల దహనం మదనపల్లి ఉదంతంతో అలెర్ట్**

ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్నిప్రమాదాలు, దస్త్రాలు తగలబడుతున్న ఉదంతాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. తాజాగా శనివారం పోలవరం ప్రాజెక్టు, టీటీడీ సంబంధిత కార్యాలయాల్లో దస్త్రాల దగ్ధమవ్వడం వెనుక కుట్ర ఏమైనా దాగివుందా? అన్న కోణంలో ప్రభుత్వ దర్యాప్తు సాగుతోంది.







# అలుపెరుగని పరుగు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన రెండోరోజు వరుస భేటీలతో సాగింది. శనివారం సాయంత్రం 4.30కు ప్రధాని నరేంద్రమోదీతో చంద్రబాబు సమావేశమయ్యారు. దాదాపు గంటపాటు సాగిన భేటీలో -రాష్ట్ర పునర్నిర్మాణానికి తోడ్పాటు అందించాలని కోరారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, విభజన హామీలు, వెనుకబడిన జిల్లాలకు నిధుల విడుదల అంశాలపై చర్చించారు. ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికీ నిధులందేలా చూడాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు వెంట కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ లోక్‌సభా పక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు. మోదీతో భేటీ అనంతరం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన చంద్రబాబు.. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై చర్చించారు. ఏపీ ఆర్థిక పరిస్థితి, కేంద్రం నుంచి నిధుల విడుదలపై 40 నిమిషాలపాటు చర్చ సాగింది. అక్కడేవున్న కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో చంద్రబాబు సెపరేట్‌గా భేటీ అయ్యారు. చివరిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమైన చంద్రబాబు.. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.



4

## ఫేక్ బుద్ధులు మానవా?

**జగన్.. ఇకనైనా వైఖరి మార్చుకో ధ్వజమెత్తిన మంత్రి నిమ్మల**

పోలవరం ప్రాజెక్టు విషయంలో వైకాపా విష ప్రచారం చేస్తోంది. డయాఫ్రం వాల్‌పై నివేదిక రాకముందే లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తోంది. జగన్ ఇప్పటికైనా ఫేక్ బుద్ధులు, ప్రచారాలు మానాలి. వైఖరి మారకుంటే.. జగన్‌కు రాజకీయ భవిష్యత్తే ఉండదు.

## కౌంట్‌డౌన్ కామెంట్రీ



పోలవరాన్ని అర్థం చేసుకోవడం తనలాంటి మేధావులకే అసాధ్యమని ఆనాడు పలికిన అంబటి రాంబాబు.. వైఎస్సార్సీపీ హయాంలోనే ప్రాజెక్టు పనులు శరవేగంగా జరిగాయన్న డ్రామా మాటలు పలకడం విడ్డూరం!!

గంట, అరగంటలోన
పూర్తికాదు పోలవరం!
అంతకంటె ఎక్కువగా
ఉండదుగా మీ'కాలం!?

విద్యలేని పనికెందుకు
ప్రగల్భాలు.. ప్రకోపాలు!
ప్రపంచాన్కి తెలుసునుగా....
ఫ్యానుగాళ్ల పౌరుషాలు!!

మాట రోత.. రాత రోత
ఫ్యాను పార్టీ గాలి రోత!?
అబద్ధాల కోతలకు..
రాష్ట్ర ప్రజలు పెట్టె వాత!!

పచ్చిపులుసు ప్రచారాలు
సాగవింక బవిరన్నా..!
ఎవరిగొప్ప ఏపాటిదో
ఆంధ్ర ప్రజకు తెలుసన్నా!?

-మహాదేవ



2

ఏసీఏ అధ్యక్షుడిగా..
## కేశినేని చిన్ని ఏకగ్రీవం

5

హత్యాచార ఘటనలో
## సత్వర న్యాయం జరగాలి



## మరో 7 ఎయిర్‌పోర్టులు!



- రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే సత్వరం పనులు
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి
- సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి చర్చలు
- కేంద్రమంత్రి ఆహ్వానం మేరకు ఆయన కార్యాలయానికి వెళ్లిన సీఎం

2 5

## విద్యుత్‌షాకులపై ఆరా..



- అధికారులతో మంత్రి గొట్టిపాటి వర్చువల్ సమీక్ష
- వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని ఆదేశం
- విద్యుత్ లైన్ల మరమ్మతులపై దృష్టి పెట్టండి..
- మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ



## సర్కారే మాకు దిక్కు!

3

- సమస్యల పరిష్కారం కోరుతూ పోటెత్తిన ప్రజా వినతులు
- పారదర్శక వినతులకు తక్షణ పరిష్కారమన్న నేతలు
- ప్రజలకు జవాబుదారీ టీడీపీ రాజకీయ విధానం: వర్ల రామయ్య
- గ్రీవెన్స్‌కు హాజరైన మంత్రి అనగాని.. ఎంపీ, ఎమ్మెల్యే, పార్టీ నేతలు



5

## రెండురోజులు రాష్ట్రంలో వర్షాలు



## స్టాప్‌లాగ్.. సక్సెస్!

4

- చంద్రబాబు సమర్థతకు నిదర్శనం
- ఫలించిన నిపుణుల కృషి
- తుంగభద్ర డ్యామ్‌లో నీటివృథాకు అడ్డుకట్ట
- 30 టీఎంసీల నీటిని ఆదా చేసిన చంద్రబాబు ముందుచూపు

# ఏపీలో మరో 7 విమానాశ్రయాల ఏర్పాటు

- రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే సత్వరం పనులు
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి
- సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి చర్చలు
- కేంద్రమంత్రి ఆహ్వానం మేరకు ఆయన కార్యాలయానికి వెళ్లిన ముఖ్యమంత్రి



ఢిల్లీ: ఏపీలోని ఏడు విమానాశ్రయాలను 14కు విస్తరించాలనేదే తన లక్ష్యమని కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజమహేంద్రవరం, విజయవాడ, కడప విమానాశ్రయాల్లో టెర్మినల్ సామర్థ్యం పెంపు పనులపై సీఎం చంద్రబాబుతో సమీక్ష చేసినట్లు తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శనివారం పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఆహ్వానం మేరకు సీఎం చంద్రబాబు అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీలో విమానయాన రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, ప్రతిపాదనలపై ముఖ్యమంత్రికి అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. విమానాశ్రయాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం సూచించారని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో నూతన ఎయిర్ పోర్టుల నిర్మాణం గురించి అధికారులతో చర్చించాం. ఎయిర్ పోర్టుల అభివృద్ధి, హెలికాప్టర్, డ్రోన్ సేవలు, సీ ప్లెయిన్, విమాన సేవల పెంపు అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. విమానయాన రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో విమానయాన రంగానికి సంబంధించి కీలక అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించా. ఏపీలో 14 ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేస్తాం. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండడానికి ప్రధాన కారణం చంద్రబాబు. అందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నా కార్యాలయానికి ఆహ్వానించా. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఏడు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు జరుగుతున్నాయి. విశాఖపట్టణం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, కడప విమానాశ్రయాల్లో రాకపోకలు సాగుతున్నాయి. టెర్మినల్ భవనాల విషయంలో అవసరాల మేర ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చించాం. కొత్త విమానాశ్రయాల ఏర్పాటు గురించి మాట్లాడాను. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే విమానయాన శాఖ తరపు నుంచి వెంటనే చర్యలు చేపడతామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.



## సంపూర్ణ సహకారం

కుప్పం, దగదర్తి (నెల్లూరు), నాగార్జున సాగర్, తునిలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో ఉన్న ఎయిర్ స్ట్రిప్ ను అభివృద్ధి చేసే అంశం గురించి ఆలోచిస్తాం. సీఎం చంద్రబాబు నుంచి వచ్చిన ప్రతిపాదనలకు మా శాఖ నుంచి పూర్తిస్థాయిలో సహకారం ఉంటుంది. పుట్టపర్తిలో ఉన్న ప్రైవేటు విమానాశ్రయాన్ని పబ్లిక్ విమానాశ్రయంగా మార్చే అంశం గురించి చర్చించాం. తూర్పు తీర ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్ హబ్‌గా మార్చాలన్నది చంద్రబాబు నాయుడు విజన్. అందుకు విమానాశ్రయాల పాత్ర ప్రధానంగా ఉంటుంది. 30 ఏళ్ల తర్వాత ఏర్పడబోయే పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడే ఆలోచన చేశాం. ఒక్కో విమానాశ్రయానికి వందల ఎకరాల భూమి కావాలి. భవిష్యత్తులో భూములు లభ్యత తక్కువగా ఉంటుంది. భవిష్యత్తు అవసరాల మేరకు కొత్త విమానాశ్రయాల నిర్మాణం చేపట్టాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. చిన్న విమానాశ్రయాల కనెక్టివిటీ పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వంలో ఉడాన్ పథకం ఉంది. ఆ పథకం ఉపయోగించుకుని రాష్ట్రంలో విమానాశ్రయాల కనెక్టివిటీని మరింత పెంచాలని చూస్తున్నాం. సి-ప్లేన్ పాలసీ ప్రకారం ప్రకాశం బ్యారేజ్ బ్యాక్ వాటర్‌లో వాటర్ ఏరో డ్రోమ్ ఏర్పాటు గురించి చర్చించాం. నాగార్జునసాగర్, కోస్తా తీరంలో చాలా చోట్ల సీ ప్లేన్ సామర్థ్యాన్ని పెంపొందిస్తాం. ప్రతి జిల్లాకు ఒక హెలిపోర్టు ఏర్పాటు చేసి పర్యాటకం, మెడికల్ ఎమర్జెన్సీ సందర్భాల్లో ఆ సేవలు వినియోగించుకునేలా ప్రతిపాదనలు ఉన్నాయి అని' కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వివరించారు.

## రెండేళ్లలో పూర్తి

విమానయాన రంగానికి సంబంధించి మౌలిక వసతుల ప్రాజెక్టులను రెండేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి ప్రాజెక్టుకు డెడ్ లైన్ విధించుకొని ఆ ప్రకారం ముందుకెళ్తున్నాం. డ్రోన్లు నా శాఖ పరిధిలోని అంశం. వీటిని వివిధ రంగాల్లో ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించాం. ఏపీలో 3 వారాల్లో డ్రోన్లపై ఒక ప్రత్యేక ఈవెంట్ ఏర్పాటు నిర్వహిస్తాం. డ్రోన్ల తయారీదారులను రాష్ట్రానికి పిలిపించి దేశ స్థాయిలో మెగా ఈవెంట్ నిర్వహిస్తాం. వ్యవసాయం సహా ప్రజాసేవలో డ్రోన్లను విరివిగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రాష్ట్రం గురించి ఆలోచిస్తూనే జాతీయస్థాయిలో విమానయాన రంగాన్ని ఎలా వృద్ధి చేయాలనే అంశంపై చంద్రబాబు నాయుడు సూచనలు చేశారు. దేశాభివృద్ధిలో విమానయాన రంగం ఎంత కీలక పాత్ర పోషిస్తుందో తెలుపుతూ చంద్రబాబు విజన్ వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్‌లో శంకుస్థాపన చేశారు. కార్గో సదుపాయాలను మరింత పెంపొందించడం గురించి కూడా చర్చించామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

అన్ని విమానయాల సంస్థలను సంప్రదించి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ నగరాలకు కనెక్టివిటీ పెంచుతాం. విజయవాడ విమానాశ్రయానికి ముంబై నుంచి రెండు, ఢిల్లీ నుంచి ఒకటి, బెంగళూరు నుంచి ఒకటి, విశాఖపట్నం నుంచి ఒక సర్వీసులను త్వరలో ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం భూమి సేకరించి ఇస్తే కేంద్ర ప్రభుత్వమే ఎయిర్ పోర్టుల నిర్మాణం చేపడుతుంది. దాంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడదు. ఆ ప్రతిపాదనలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, ముందుకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారిస్తాం అని' కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.





## ఏసీఏ అధ్యక్షుడిగా ఎంపీ కేశినేని చిన్ని ఏకగ్రీవం



అమరావతి(చైతన్యరథం): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడిగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాత కార్యవర్గం రాజీనామా చేయడంతో శనివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏసీఏలోని అన్ని పదవులకు ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో పోటీ జరగలేదు. ఉపాధ్యక్షుడిగా వెంకట ప్రశాంత్ , కార్యదర్శిగా సానా సతీష్, జాయింట్ సెక్రటరీగా ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు, కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్‌గా డి.గౌరు విష్ణు తేజ్ ఎన్నికయ్యారు. అధికారిక ప్రకటన మాత్రం.. సెప్టెంబర్ 8వ తేదీన చేస్తారు.

## ఇద్దరు టీచర్ల మృతిపై మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి



అమరావతి(చైతన్యరథం): వాగులో కొట్టుకపోయి ఇద్దరు ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖలు మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. మన్యం జిల్లాలో సరాయివలస వద్ద వాగు ఉధృతికి కొట్టుకుపోయి ఇద్దరు టీచర్లు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతులకు కన్నీటి నివాళులు అర్పిస్తున్నానన్నారు. మృతుల కుటుంబాలను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.





మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి అనగాని, వర్ల రామయ్య, నక్కా ఆనంద్‌బాబు తదితరులు

# సర్కారే మాకు దిక్కు!

> అర్జీలపై ఎప్పటికప్పుడు అధికారులను ఫోన్లు చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వంలో ఇటువంటి జవాబుదారీతనం కనిపించలేదు. జగన్ పార్టీ మనుషులకే పోలీసు స్టేషన్‌లలో, ఇతర శాఖల్లో పనులు జరిగేవి. నేడు ఏ పార్టీ వారొచ్చినా.. సమస్యల పరిష్కారానికి టీడీపీ కృషిచేస్తోంది. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే టీడీపీ అధినేత చంద్రబాబు ఆశయం.

- సమస్యల పరిష్కారం కోరుతూ పోటెత్తిన ప్రజా వినతులు
- పారదర్శక వినతులకు తక్షణ పరిష్కారమన్న నేతలు
- ప్రజలకు జవాబుదారీ టీడీపీ రాజకీయ విధానం: వర్ల రామయ్య
- గ్రీవెన్స్‌కు హాజరైన మంత్రి అనగాని.. ఎంపీ, ఎమ్మెల్యే, పార్టీ నేతలు

అమరావతి (చైతన్య రథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రజా వినతులను పారదర్శకంగా పరిశీలించి తగు న్యాయం చేస్తున్నట్లు పార్టీ నేతలు శనివారం ప్రకటించారు. శనివారం ప్రజలను కలవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ఉండటంతో -మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యలు ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలపై ఎప్పటికప్పుడు అధికారులను ఫోన్లు చేసి పరిష్కరానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఇటువంటి జవాబుదారితనం లేదన్నారు. జగన్ పార్టీ మనుషులకే పోలీసు స్టేషన్‌లలో పని జరిగేదన్నారు. నేడు ఏ పార్టీ వారొచ్చినా.. సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నదే టీడీపీ అధినేత చంద్రబాబు ఆశయమని వర్లరామయ్య తెలిపారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు, మంత్రులకు పంపుతున్నామన్నారు. గ్రీవెన్స్ సెల్ పెట్టినప్పటి నుండి వినతులతో వస్తోన్న అర్జీదారులు.. పార్టీ కార్యాలయాన్నే దేవాలయంగా భావిస్తున్నారని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. అలాంటి గొప్ప కార్యక్రమంలో తమను భాగస్వామ్యం చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని మహిళల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి పరిరక్షణకు ఇప్పటికే ముఖ్యమంత్రి సంబంధిత మంత్రులకూ ఆదేశాలిచ్చారన్నారు.

వైసీపీ నేతల భూకబ్జా అరాచకాలు అడ్డుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తమపై అక్రమ కేసులు పెట్టించి రౌడీ షీట్ ఓపెన్ చేయించాడని.. అప్పట్లో ఊళ్లొదిలి వెళ్లిపోయిన పార్టీ క్యాడరు ఒక్కొక్కరుగా సొంతూరికి వస్తోన్నరని.. ఈ నేపథ్యంలో అక్రమ పోలీస్ కేసుల నుంచి తమకు విముక్తి కల్పించాలని తిరుపతి జిల్లా శెట్టిపల్లికి చెందిన జంపాల గోపి, ఇర్ల గౌతమ్ గ్రీవెనస్‌లో విజ్ఞప్తి చేశారు.

నూజివీడు మండలం సిద్దార్థనగర్‌కు చెందిన యాదాల శ్రీనివాస్ విజ్ఞప్తి చేస్తూ.. 2018 - 2019లో సీసీ రోడ్ల వర్క్‌ను తాను చేస్తే దానికి రావాల్సిన రూ.44,48,000లను తనకు తెలియకుండా వైసీపీ నేతలు అధికారులతో కలిసి కొట్టేశారన్నాడు. ప్రభుత్వాన్ని మోసం చేసి డబ్బులు కొట్టేసిన అధికారులు, వైసీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

కృష్ణా జిల్లా గూడూరు మండలం కలపటానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేస్తూ... చంద్రబాబు ఇంటిపై దాడి చేసిన వైసీపీ నేతలు అయినాల నాగేశ్వరరావు, అయినాల దేవనాగ శ్రీనివాసరావు, అయినాల మణికంఠలు తనపై కక్ష గట్టి గ్రామంలో సీసీ రోడ్ల కోసం చేసిన వర్క్ పనులకు డబ్బులు రాకుండా అడ్డుకున్నారని... తనను చంపడానికి కారుతో గుద్దారని.. తన ఇంటిని ధ్వంసం చేయడానికి జేసీబీతో వచ్చారని... అప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని... తనకు రావాల్సిన వర్క్ బిల్లులు రూ.40 లక్షలతో పాటు తనపై దాడి చేసిన వైసీపీ నేతలను కఠినంగా శిక్షించాలని వేడుకున్నాడు.

తాను కాళ్లులేని దివ్యాంగుడినని, తన తల్లిదండ్రులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని వారి మరణానంతరం గ్రామంలో కొంతమంది కబ్జా చేసి తప్పుడు ధ్రువపత్రాలతో ఆక్రమించుకొన్నారని.. భూ ఆక్రమణపై విచారణ జరిపి న్యాయం చేయాలని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఏంపేడుకు చెందిన డబ్బా వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశాడు.

నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం కొండ సముద్రానికి చెందిన ఘట్టమనేని శ్రీనివాసులు విజ్ఞప్తిచేస్తూ.. టీడీపీకి పనిచేసిన తమ కుటుంబంపై వైసీపీ అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతోందని, అక్రమ కేసుల వలన తన కుమారుడు పైచదువులకు ఆటంకంగా మారిందని.. అక్రమ కేసులు తొలగించి తన బిడ్డ పైచదువులకు విదేశాలకు వెళ్లేందుకు సహకరించాలని గ్రీవెన్స్‌లో శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు.

అంబులెన్స్ సేవకులుగా పనిచేస్తోన్న తమకు.. 2020లో అరవింద సంస్థతో జరిపిన అగ్రిమెంటులో జీతభత్యాల నందు స్లాబ్ సిస్టమ్ క్లాజ్ పెట్టి వైసీపీ ఇబ్బంది పెట్టిందని, దాన్ని రద్దుచేసి తమకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో అర్జీ అందించారు

ఏపీలోని అన్ని జిల్లాల్లో గ్రామ పంచాయతీల్లో పనిచేయుచున్న టైమ్ స్కేల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని.. వైసీపీ ప్రభుత్వం మూడేళ్లపాటు జీతాలు లేకుండా పనిచేయించుకున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని గ్రీవెన్స్‌లో అర్జీలను అందించారు.

తిరుపతి జిల్లా కెవిబి పురం మండలం దిగువ పుత్తూర్ గ్రామానికి చెందిన పాఠశాల స్థలాన్ని పలువురు ఆక్రమించుకొంటున్నారని... పాఠశాలకు ప్రహారి నిర్మించి పాఠశాల స్థలాన్ని కాపాడాలని.. అంతేకాకుండా తమ ఊరిలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరిందని నూతన అంగన్‌వాడీ భవనాన్ని మూంజూరు చేయాలని గ్రామస్తులు గ్రీవెన్స్‌లో కోరారు.

1920నుండి 2014 ఆగస్టు వరకు జరిగిన రిజిస్ట్రేషన్లు 2014లో కాంగ్రెస్ నిలుపుదల చేసిందని.. భూముల సమస్య పరిష్కారానికి గతంలో టీడీపీ ప్రభుత్వం చొరవ చూపిందని.. దానికోసం అసెంబ్లీలో చట్టం చేసి రాష్ట్రపతికి పంపించారని... తరువాత వచ్చిన వైసీపీ దాన్ని పట్టించుకోలేదని... దాంతో సింగరాయకొండ, సోమరాజుపల్లెల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆ భూములకు యథావిధిగా రిజిస్ట్రేషన్‌లు చేసుకొనే అవకాశం కల్పించాలని గ్రామాల ప్రజలు కోరారు.

పరిశ్రమలను తరిమేసి నిరుద్యోగుల ఉద్యోగ భద్రతను వైసీపీ దెబ్బతీసిందని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని గ్రీవెన్స్‌కు యువకులు పోటెత్తారు. తాము దివ్యాంగులమైనా తమకు గత ప్రభుత్వంలో పింఛన్ ఇవ్వలేదని.. తమ అర్హతను గుర్తించి పింఛన్ మంజూరు చేయాలని దివ్యాంగులు కోరారు. తాము నిరుపేదలమైనా తమకు గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించలేదని. తమకు ఇళ్లు మంజరు చేసి ఆదుకోవాలని మరికొందరు పేదలు వాపోయారు. రేషన్ కార్డు సమస్యలు. భూ ఆన్‌లైన్ సమస్యలు, సీఎంఆర్‌ఎఫ్ కోసం వచ్చిన వినతులు.. ఇలా అనేక అర్జీలను నేడు నాయకులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.





# దస్త్రాల దహనం వెనుక కుట్ర!?

## మదనపల్లె ఉదంతంతో రేకెత్తుతున్న అనుమానాలు

- **ఒకేరోజు.. పోలవరం, టీటీడీ దస్త్రాల దహనం**
- **రంగంలోకి దిగిన పోలీస్, దర్యాప్తు బృందాలు**



అమరావతి, తిరుపతి, ధవళేశ్వరం (చైతన్యరథం): ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్నిప్రమాదాలు, దస్త్రాలు తగలబడుతున్న ఉదంతాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంటలు చెలరేగి నిషేధిత భూములకు సంబంధించి దస్త్రాలు తగడబడటం రాష్ట్రంలో సంచలనమైంది. వైకాపా ప్రభుత్వంలో భారీ ఎత్తున భూదందాలకు పాల్పడిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుట్ర కోణం వెలుగు చూడటంతో.. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం.. కేసు నిగ్గు తేల్చేందుకు దర్యాప్తును ముమ్మరం చేసింది. మదనపల్లి తరహాలోనే తాజాగా ఇటు పోలవరం ప్రాజెక్టు, అటు టీటీడీకి సంబంధిత కార్యాలయాల్లో దస్త్రాల దగ్ధం, అగ్ని ప్రమాదాలు అనుమానాలకు తావిస్తున్నాయి.

ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయంలో దస్త్రాలు దగ్ధమవడం కలకలం సృష్టిస్తోంది. కార్యాలయ ఆవరణలోనే పోలవరం ఎడమ ప్రధాన కాల్వకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమైన ఉదంతం శనివారంనాటి పరిణామాల్లో వెలుగుచూసింది. కార్యాలయంలోని అధికారులే కాల్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూసేకరణకు సంబంధించి లబ్దిదారులకు పరిహారం విషయంలో అక్రమాలు బయటకు వస్తాయనే ఈ దుర్ఘటనకు పాల్పడి ఉంటారన్న కోణంలో దర్యాప్తు మొదలైంది. ఘటనా స్థలంలో సగం కాలిపోయిన దస్త్రాలను ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. కాల్చివేసిన దస్త్రాలను ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివజ్యోతి, డీఎస్పీ భవ్యకిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేదవల్లి పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అందజేసిన పరిహారానికి సంబంధించిన దస్త్రాలుగా ప్రాథమికంగా నిర్ధారించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుమతి తీసుకోకుండానే శుక్రవారం రాత్రి దస్త్రాలను దగ్ధం చేసిన కార్యాలయ సిబ్బందిని అధికారుల బృందం విచారిస్తోంది.

ఇదిలావుంటే.. తిరుపతిలోని తితిదే పరిపాలనా భవనంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో పలు దస్త్రాలు దగ్ధమయ్యాయి. తితిదే పరిధిలోని 13 ఆలయాలకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమైనవాటిలో ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. అగ్ని ప్రమాదంపై ఉద్యోగి నాగార్జున అధికారులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకునేలోపే మంటలు అదుపులోకి వచ్చాయి. అసిస్టెంట్ ఇంజినీర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదవశాత్తూ జరిగిందా? కుట్రకోణం ఏమైనా ఉందా? అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఐదేళ్ల జగన్ జమానాలో ప్రజాప్రతినిధుల ప్రలోభాలకు తలొగ్గి ప్రభుత్వోద్యోగులు సైతం పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. భూములు, మద్యం, ఇసుక, అడవులు, గనులు.. ఇలా భారీగా రాష్ట్ర వనరులు జగన్ జమానాలో దోపిడీకి గురవ్వడం తెలిసిందే. వైసీపీ సర్కారు అక్రమాలను ఒక్కొక్కటిగా తవ్వుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. పక్కాగా దోపిడీలను వెలుగులోకి తేవడంపై దృష్టి పెట్టడం తెలిసిందే. దీంతో అవినీతికి పాల్పడిన ఉన్నతస్థాయి ఉద్యోగుల ప్రోద్భలంతో కిందిస్థాయి సిబ్బంది దస్త్రాలను దగ్ధం చేయడం, మాయం చేయడంపై దృష్టి పెట్టారన్న అనుమానాలు తీవ్రమవుతున్నాయి..

### సిసోదియా నివేదికతో కుట్ర బట్టబయలు

మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దహనం కేసులో పూర్వ ఆర్డీవోలు మురళి, హరిప్రసాద్, సీనియర్ సహాయకుడు గౌతమ్ తేజలను సస్పెండ్ చేయాలంటూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా నివేదిక ఇవ్వడం తెలిసిందే. ఫైళ్లు కాలిపోవడానికి షార్ట్ సర్క్యూట్ కారణం కాదని, బయటి వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా అగ్ని ప్రమాదం సృష్టించారన్న విషయం సిసోడియా నివేదికతో బట్టబయలైంది. దెబ్బతిన్న సీసీ కెమెరాలను కావాలనే బాగు చేయించలేదని ఆయన నివేదికలో పొందుపర్చారు. అలాగే, మొత్తం 2,440 ఫైళ్లు కాలిపోతే 700 ఫైళ్లనే కాపాడారు. ఇవన్నీ నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన భూములకు సంబంధించినవేనని సిసోడియా నివేదిక -ఈ స్థాయిలో అవినీతి జరిగి ఉంటుందన్న అంచనాలకు అద్దం పట్టింది. ఈ కుట్రలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏ, ముఖ్య అనుచరుల ప్రమేయాన్ని సిసోడియా ప్రస్తావించడం గమనార్హం. ఇప్పుడు.. పోలవరం, టీటీడీ దస్త్రాల దహనం వెనుక కుట్ర కోణమేమైనా ఉందా? అన్న అనుమానాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

---




## స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు సక్సెస్

### చంద్రబాబు సమర్ధతకు నిదర్శనం

- **ఫలించిన నిపుణుల కృషి**
- **తుంగభద్ర డ్యామ్‌లో నీటివృథాకు అడ్డుకట్ట**
- **30 టీఎంసీల నీటిని ఆదా చేసిన చంద్రబాబు ముందుచూపు**

అమరావతి(చైతన్యరథం): తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక గేటు ఏర్పాటు ప్రక్రియ విజయవంతమైంది. దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, సమర్ధతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. విరిగిపోయిన గేటు వద్ద మొత్తం 5 ఎలిమెంట్లను సాంకేతిక నిపుణుల బృందం అమర్చింది. దీంతో 19వ గేటు నుంచి నీటి వృథాకు అడ్డుకట్ట పడింది. శనివారం సాయంత్రానికి స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు విజయవంతం కావడంతో అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది సంబురాలు చేసుకున్నారు. డ్యామ్ గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు పర్యవేక్షణలో గేటు ఏర్పాటు పనులు జరిగాయి.

తుంగభద్ర ప్రాజెక్టులో గేటు కొట్టుకుపోయిందని తెలిసిన వెంటనే, క్షణాల్లో చంద్రబాబు పరిస్థితిని సమీక్షించి మంత్రులను, అధికారులని అక్కడికి పంపించారు. తుంగభద్ర బోర్డుకు సహాయ, సహకారాలు అందించాలని మంత్రులు, అధికారులను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. కన్నయ్య నాయుడి బృందాన్ని రంగంలోకి దింపారు. కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ నిపుణులు అద్భుతమే చేశారు. డ్యాంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు కోసం తొలుత 60 టీఎంసీలు నీరు ఖాళీ చేయాలని అధికారులు భావిస్తే, డ్యాంలో 70 టీఎంసీల నీరు ఉండగానే స్టాప్‌లాగ్ గేటును కన్నయ్య నాయుడు బృందం విజయవంతంగా ఏర్పాటు చేసింది. దీంతో 30 టీఎంసీల నీరు సముద్రం పాలు కాకుండా సీఎం చంద్రబాబు, కన్నయ్య నాయుడు వ్యూహం కాపాడింది.

కడప, కర్నూల్, అనంతపురం జిల్లాలకి దాదాపుగా 30 టీఎంసీలు నీరు అందుబాటులోకి వచ్చింది. ఇది ఆ జిల్లాలకు నిజంగా పండగ లాంటి వార్త. ఎందుకంటే, ఆ మూడు జిల్లాల గతాగు, సాగు నీటి అవసరాలు తీర్చేది, తుంగభద్ర నీళ్ళే. దీంతో మరోసారి చంద్రబాబు సమర్ధత నిరూపణ అయింది.

---

# ఫేక్ బుద్ధులు మానవా?

- **జగన్.. ఇకనైనా వైఖరి మార్చుకో**
- **పోలవరంపై మాట్లాడే అర్హత లేదు మీకు**
- **ధ్వజమెత్తిన ఇరిగేషన్ మంత్రి నిమ్మల**



ఢిల్లీ (చైతన్య రథం): పోలవరం ప్రాజెక్టు విషయంలో వైకాపా విష ప్రచారం చేస్తోందని ఏపీ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. డయాఫ్రం వాల్‌పై నివేదిక రాకముందే లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఢిల్లీవెళ్లిన నిమ్మల... ఆంధ్రభవన్‌లో తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. ఇకనైనా జగన్ వైఖరి మారకుంటే... సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతారని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండి పోలవరం ప్రాజెక్టును గోదావరి పాల్జేసి వాళ్లు సిగ్గులేకుండా ఏ ముఖం పెట్టుకుని పోలవరం గురించి మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. జగన్ అసమర్ధ పాలనను కప్పిపుచ్చడానికే సమర్థవంతమైన ఎన్డీయే పాలనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం గురించి వైసీపీ మాట్లాడటమంటే.. దొంగే దొంగ దొంగ అని అరిచినట్టని ఎద్దేవా చేశారు. 2020 ఆగస్టులో వచ్చిన వరదలకు ఎగువ కాపర్ డ్యాం దెబ్బతిందని హైదరాబాద్ ఐఐటీ నిపుణులు చెప్పిన మాట వాస్తవం కాదా? అని మంత్రి ప్రశ్నించారు. 2019 మే నుంచి 2020 ఆగస్టు వరకు పనిచేసే ఏజెన్సీ లేకపోవడమే డయాఫ్రమ్ వాల్ దెబ్బ తినడానికి కారణమని ఐఐటీ నిపుణుల నివేదికను ప్రస్తావించారు. రెండు నెలల్లో పూర్తి కావాల్సిన కాపర్ డ్యాంను 13 నెలలు పూర్తి చేయకపోవడమే విధ్వంసానికి కారణమన్న నిపుణుల కమిటీ నివేదికను మంత్రి ప్రస్తావించారు. క్లిష్టతరమైన ప్రాజెక్టులలో ఏజెన్సీలను మార్చవద్దని పీపీఏ హెచ్చరిస్తూ లేఖ రాయలేదా? ఒకే పనిని రెండు ఏజెన్సీలు చేస్తే పోలవరం డ్యాంకు నష్టం వాటిల్లితే ఎవరు బాధ్యత వహిస్తారన్న విషయంపై పీపీఏ మినిట్స్‌లో వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించలేదా? తెలుగుదేశం ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టుకు 11,762 కోట్లు ఖర్చు పెడితే.. అందులో కేంద్ర నిధులు 6,764 కోట్లు మాత్రమేనని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వంలో పోలవరానికి 4,167 కోట్లు ఖర్చు పెడితే.. కేంద్రం నుంచి వచ్చిన నిధులు రూ.8,382 కోట్లని చెబుతూ.. వైసీపీ సర్కారు ఖర్చుపెట్టిన దానికంటే కేంద్రంనుంచి అధికంగా వచ్చిన రూ.3,385 కోట్లు దారి మళ్లించిన మీకు -పోలవరం గురించి మాట్లాడే అర్హత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర నిధుల కోసం చూడకుండా.. ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిధులు అడ్జెస్ట్ చేసుకుని ఆనాటి టీడీపీ ప్రభుత్వం పనులను ముందుకు తీసుకెళ్లిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించిన జగన్‌కు ప్రాజెక్టు పూర్తి చేయడంపై చిత్తశుద్ధి ఎక్కడుందని మంత్రి ప్రశ్నించారు. 'పోలవరం డయాఫ్రం వాల్‌పై నివేదిక రాకముందే లేనిపోని అబద్ధాలు చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడూ వైకాపా నేతలు అవే అబద్ధాలు చెప్పారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించిన వైకాపా నేతలకు, ఆ ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదు. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి.. నిజమని నమ్మించాలన్న భ్రమలో వైకాపా ఉంది' అని నిమ్మల ఎద్దేవా చేశారు.

చైతన్యరథం

# 24 ఏళ్ల తరువాత తిరుపతిలో మొక్క నాటా..



## - స్పీకర్ అయ్యన్నపాత్రుడు

తిరుపతి(చైతన్యరథం): దాదాపు 24 ఏళ్ల తరువాత తిరుపతిలో మొక్క నాటానని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆనందం వ్యక్తం చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు శనివారం తిరుపతిలో పర్యటించారు. నగరంలోని శ్రీ వెంకటేశ్వర జూ పార్క్ ను సందర్శించారు. తన పర్యటన వివరాలను అయ్యన్నపాత్రుడు సోషల్ మీడియాలో పంచుకున్నారు. 24 ఏళ్ల కిందట నేను అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్కును సందర్శించి ఓ మొక్కను నాటాను. నేడు అసెంబ్లీ స్పీకర్ హోదాలో, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి తాజాగా ఓ మొక్కను నాటాను. పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత. అన్ని రాష్ట్రాలలో మొక్కలు పెంచుతుంటే, గత ప్రభుత్వ హయాంలో విపరీతంగా చెట్లు నరికేశారు. అసలు అన్ని చెట్లు ఎందుకు నరికేశారో వాళ్లకే తెలియదు. నేను అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒక్కరోజులోనే లక్ష మొక్కలు నాటిన చరిత్ర ఈ ప్రభుత్వానికి ఉంది. మళ్లీ అలాంటి కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరానని అయ్యన్నపాత్రుడు వివరించారు. ఈ మేరకు తన పర్యటన ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు.



## జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో సత్వర న్యాయం జరగాలి: లోకేష్



అమరావతి (చైతన్యరథం): కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో సత్వర న్యాయం జరగాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన యావత్ దేశాన్ని కలిచివేసింది. దీంతో బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై తాజాగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఆమెపై జరిగిన దారుణాన్ని తలచుకుంటే మాటలు రావడంలేదని, ఈ విషయంలో సత్వర న్యాయం జరగాలని లోకేశ్ ట్వీట్ చేశారు. ఆ యువ వైద్యురాలు పడిన బాధను తలచుకుంటే మాటలు రావడంలేదు. ఈ క్రూరత్వానికి ఏ ఖండన లేదు. న్యాయం.. వేగంగా, నిర్ణయాత్మకంగా, ఆదర్శప్రాయంగా ఉండాలి. బాధితురాలి కుటుంబానికి, ఆమెకు న్యాయం చేయాలని కోరుతున్న వారందరికీ నేను సంఘీభావం తెలుపుతున్నాను. ప్రతి మహిళకు భద్రత, గౌరవాన్ని ఇవ్వడానికి మనం ఐక్యంగా ఉండాలి. మంచి మనిషిగా ఉండడమే అత్యంత ప్రభావవంతమైన నిరసన... అబ్బాయిలు, పురుషులందరికీ నా సందేశం ఇదే! ఇది అందరి పోరాటం కావాలి" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## విద్యుత్‌షాక్ మరణాలపై మంత్రి గొట్టిపాటి ఆరా

- అధికారులతో వర్చువల్‌గా సమీక్ష
- వేలాడుతున్న కరెంటు వైర్లను సరిచేయాలి
- విద్యుత్ లైన్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలి
- మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తాం



అమరావతి: విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శనివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ షాక్‌తో చనిపోయిన వారి వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రాణ నష్టాన్ని తగ్గించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ షాక్‌తో ఎక్కువ మంది మృత్యువాత పడుతుండటంపై ఆరా తీశారు. రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, తగిన చర్యలు చేపట్టాలని అదేశించారు. విద్యుత్ లైన్ల మరమ్మతులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని తెలిపారు. తర్వాత చేయబోయే సమీక్షనాటికి సంబంధిత సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

చనిపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం తమ ప్రభుత్వ విధానం కాదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాధితులందరి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖతో నష్టపోయిన ప్రతీ కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కరెంట్ షాక్ ఘటనలు చాలా జరుగుతున్నాయి. అధికారులంతా ఈ అంశంపై దృష్టిసారించాలి. నిత్యం నివేదికలు సిద్ధం చేసుకోవాలి. విద్యుత్ లైన్ల మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. చనిపోయిన వారికి ఎంతో కొంత నష్టపరిహారం ఇవ్వడం మా ప్రభుత్వ విధానం కాదు. బాధిత కుటుంబాలందరినీ అన్ని రకాలుగా అదుకుంటామని మంత్రి రవి కుమార్ స్పష్టం చేశారు.



# రెండు రోజులు రాష్ట్రంలో వర్షాలు

అమరావతి: రాగల రెండు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణం విభాగం (ఐఎండీ) తెలిపింది. ఐఎండీ సూచనల ప్రకారం ఉత్తర కర్ణాటకను ఆనుకొని ఉన్న తెలంగాణ ప్రాంతంలో ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. దీని ప్రభావంతో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

సోమవారం.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, నెల్లూరు, కర్నూలు, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, టవర్స్ కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించారు.

## సామాజిక సేవకు వెంకయ్యనాయుడి జీవితం అంకితం

### - కొనియాడిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

నెల్లూరు: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సామాజిక సేవే పరమావధిగా నిత్యం కృషి చేస్తున్నారని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శనివారం నెల్లూరు జిల్లాలో పర్యటించారు. వెంకయ్యనాయుడు స్థాపించిన స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహిస్తున్న వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దంపతులకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వర్ణభారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవ సభలో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్రమాల కోసం వెంకయ్యనాయుడు జీవితం అంకితం చేశారన్నారు. గ్రామీణ భారతంలో సేవకు ఆయన అంకితమయ్యారు. సమరయోధుల కలలు నేడు సాకారమవుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుగుపయణమైన ధన్‌ఖడ్ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిమను ఉప రాష్ట్రపతికి మంత్రి అందచేశారు. ఉప రాష్ట్రపతి దంపతులకు వీడ్కోలు పలికిన వారిలో తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, ఐజీ రాజీవ్ కుమార్ మీనా, డిఐజీ షిమోషి బాజ్ పాయ్, ఎస్.పి సుబ్బరాయుడు, తదితర అధికారులు ఉన్నారు.



చైతన్యరథం







# స్మార్ట్ సిటీగా నెల్లూరు అడుగులు

- ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు కట్టొద్దు
- కేటాయించిన ప్రాంతాల్లోనే కట్టుకోవాలి
- సర్వేపల్లి కాలువపై త్వరలోనే బ్రిడ్జీలు నిర్మిస్తాం
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
- నిధులు రాగానే రెండేళ్లలో అన్నింటినీ పూర్తిచేస్తాం
- పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ

నెల్లూరు(చైతన్యరథం): నగరంలో ఆదివారం నుంచి ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు కట్టేందుకు వీలు లేదని, తాము కేటాయించిన ప్రాంతాల్లోనే ఫ్లెక్సీలు కట్టుకోవాలని రాష్ట్ర పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం ఆయన నెల్లూరు హరనాథపురం సమీపంలోని సర్వేపల్లి కాలువపై ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం నారాయణ ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

### సర్వేపల్లి కాలువపై వంతెనల నిర్మాణం

ట్రాఫిక్ కంట్రోల్ చేయాలన్న ఉద్దేశంతోనే 2014-2019 మధ్య కాలంలో సర్వేపల్లి కాలు వ మీద ఐదు బ్రిడ్జీలు నిర్మించాలని నిర్ణయించామని, మూడు బ్రిడ్జీలను కూడా మంజూరు చేశామన్నారు. వీటిలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వెంటనే బ్రిడ్జీల నిర్మాణానికి అంచనాలు రూపొందించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించా మన్నారు. ఎన్నికల సమయంలో సర్వేపల్లి కాలువ కట్ట మీద ప్రచారం చేసినప్పు డు స్థానికులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో రెండు, మూడు వరుసలతో కూడిన ఇళ్లు ఉన్నాయని, వాటి మధ్యలో కాలువ కూడా ఉం దన్నారు. ఇటువంటి కాలువల కారణంగానే సిల్ట్ ఏర్పడి అధికంగా దుర్వాసన వెదజల్లుతోందని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారని తెలిపారు. దానిని వెంటనే పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించామని చెప్పారు.

### కేంద్ర నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం

అయితే గత ప్రభుత్వ నిర్వాకంతో ప్రస్తుతం రాష్ట్ర ఖజానా డబ్బు లేక ఖాళీగా ఉందని నానా తంటాలు పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2019 నుంచి ఇచ్చిన ప్రాజెక్టులకు సంబంధించి రూ.27 వేల కోట్లు ఉన్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లు పెడితే కేంద్రం రూ.10 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. వాళ్లు ఇచ్చిన నగదునే గత ప్రభుత్వం ఇప్పటివరకు ఖర్చు పెట్టలేదన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని టేకప్ చేసి పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. అమృత 2.0, అమృత 1.0, స్వచ్ఛాంధ్ర, గ్రీన్ కార్పొరేషన్, 15వ ఆర్థిక సంఘం ఇలా అన్నింటిలోనూ నిధులు వచ్చేలా ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

### అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

నిధులు సమకూరి కొంచెం వెసులుబాటు కాగానే నెల్లూరులో పెండింగ్‌లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. అలాగే కొన్ని మున్సి పాలిటీలలో అంచనాలు రూపొందించాలని ఆదేశించామని వాటిని త్వరలోనే పూర్తిచేయడం జరుగుతుందన్నారు. టౌన్ ప్లానింగ్ డీవియేషన్స్ చేయవద్దని మంత్రి రాష్ట్ర ప్రజలకు మరో సారి విజ్ఞప్తి చేశారు.

### భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేస్తాం

ఎవరైనా భవనాలు నిర్మించుకోవాలనుకుంటే అనుమతులను సులభతరం చేస్తున్నామని, దాని కోసమే అనేక రాష్ట్రాలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక టీంలను పంపించామని చెప్పారు. వారు నివేదికలు ఇవ్వగానే సీఎంకు అందచేస్తామన్నారు. దేనికైతే అనుమతులు ఇస్తారో వాటి వరకే కట్టాలని...లేని పక్షంలోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. నెల్లూరులో ఫ్లెక్సీలు కట్టకుండా చూడాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారని, ఫ్లెక్సీలంటే నగరానికి అందం రాదన్నారు. కేవలం కొన్ని ప్రాంతాల్లోనే ఫ్లెక్సీలు పెట్టుకునేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు కేటాయించిన ప్రాంతాల్లోనే ఫ్లెక్సీలు పెట్టాలని సూచించారు. ఆదివారం నుంచి నెల్లూరులో ఇష్టానుసారం ఫ్లెక్సీలు కట్టేందుకు వీలు లేదని హెచ్చరించారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఎక్కడా ఫ్లెక్సీలు ఉం డవని తెలిపారు.

### నెల్లూరు సిటీ స్మార్ట్‌గా మారాలంటే తప్పదు

నెల్లూరు సిటీ స్మార్ట్‌గా మారాలంటే ఫ్లెక్సీలను ఎక్కడపడితే అక్కడ పెట్టకూడదని సూచిం చారు. చెన్నైలో కూడా ఫ్లెక్సీలపై జీవో ఉందన్నారు. ఆ జీవోను తెప్పించాలని ఇప్పటికే సబ్ కలెక్టర్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ డివైడర్‌లో కూడా ఫ్లెక్సీలు పెట్టకూడదని ఇప్పటికే ఆదేశించడం జరిగిందన్నారు. ఆ ప్రాంతంలో గ్రీనరీ అభి వృద్ధి చేస్తామని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో నగరమంతా గ్రీనరీ ఉండేదని వైసీపీ ప్రభుత్వం దానిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఇవన్నీ ఒకదాని తర్వాత ఒకటి చేస్తామని అన్నీ ట్రాక్‌లోకి రావాలంటే కనీసం రెండేళ్లు పడుతుందని చెప్పా రు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

---

## విశాఖలో భూముల కబ్జాపై

# సిసోదియా ఆధ్వర్యంలో విచారణ

- గత ఐదేళ్లలో జరిగిన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ప్రత్యేక దర్యాప్తు

విశాఖ (చైతన్యరథం): వైసీపీ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందనే ఆరోపణల వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా శనివారం విశాఖలో పర్యటించారు. ముందుగా మధురవాడ ప్రాంతంలోని హయగ్రీవ, రామానాయుడు స్టూడియో భూములను సిసోదియా పరిశీలించారు. కలెక్టర్, ఆర్డీఓలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కట్టుదాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత దసపల్లా భూములను పరిశీలిచంచారు. అనంతరం ఆనందపురం, భీమిలి మండలాల్లో అన్యాక్రాంతమైన భూములను సిసోదియా పరిశీలించారు. విశాఖ జిల్లా భీమునిపట్నం బీచ్ ఎర్రమట్టి దిబ్బలలో భీమునిపట్నం



మ్యూచువల్ లిమిటెట్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి, శారదా పీఠానికి కేటాయించిన భూములను కలెక్టర్ హరిప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లతో సిసోదియా పరిశీలించారు. అనంతరం భీమునిపట్నం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో 22-ఏ భూముల రికార్డులను, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ ఎం. గోపిచంద్‌ని అడిగి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలను తెలుసుకున్నారు. తర్వాత వైసీపీ హయాంలో జరిగిన కబ్జాలకు సంబంధించి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. విశాఖ నగరంలో క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం కలెక్టరేట్లో అధికారులతో సిసోదియా సమీక్ష నిర్వహించారు. విశాఖలోని దసపల్లా, హయగ్రీవ, శారదాపీఠం, రామానాయుడు స్టూడియో భూములను పరిశీలించాం. 22ఏ నుంచి తొలగించిన, ఉన్న భూములపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. 3 నెలలుగా 22ఏ నుంచి భూముల ఉపసంహరణ జరగలేదు. హయగ్రీవ భూముల్లో న్యాయపరమైన అంశాలున్నాయి. ఎర్రమట్టి దిబ్బల్లోని 7 సీటి మార్గాల్లో రెండు మూసుకుపోయాయి. దసపల్లా భూములపై సరైన వేళలో అప్పీల్‌కు వెళ్లక ఇబ్బంది వచ్చింది. విశాఖలో భూముల మ్యాపింగ్‌పై ప్రత్యేక సూచనలు ఇచ్చాము. ప్రభుత్వ భూమి, గెడ్డలు, పార్కులకు కలర్ కోడింగ్ ఇవ్వాలని సూచించాను. రెవెన్యూ సదస్సుల ద్వారా భూవివాదాల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. సదస్సుల తర్వాత రాజముద్రతో కూడిన పాస్‌బుక్‌లు ఇస్తాము. విశాఖ భూములపై వేసిన సిట్ నివేదిక బహిర్గతం చేయాలని చెప్పడం జరిగింది.

---

## లోకేష్ చొరవతో తల్లి చెంతకు పిల్లలు

- 48 గంటలలో ఛేదించిన పోలీసులు
- కూటమి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనం
- మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన పిఠాపురం నేత వర్మ



పిఠాపురం(చైతన్యరథం): మంత్రి లోకేష్ చొరవతో కనిపించకుండా పోయిన ఇద్దరు పిల్లలను పోలీసులు గుర్తించి తల్లి చెంతకు చేర్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శని వారం పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వర్మ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తూ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 20 రోజుల క్రితం ధవళేస్వరం నుంచి భార్యభర్తలు ఇద్దరూ కార్యాలయానికి తమను కలవడానికి వచ్చారని, మా ఇద్దరి పిల్లలు కనపడడం లేదని ఆవేదన చెందారని తమ దృష్టికి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈ విషయం మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని, మారోజు వెంకటేష్ అనే వ్యక్తిగా అనుమా నాలు ఉన్నాయని చెప్పారన్నారు. తక్షణమే స్పందించి మంత్రి లోకేష్ విషయం చెప్పినట్టు తెలిపారు. తల్లి ధవళేశ్వరం సునీత ఇద్దరు పిల్లలు సరోజిని, పూర్ణిమలను 48 గంటలలో తల్లి చెంతకు చేర్చిన లోకేష్‌కు పిల్లల తల్లిదండ్రులు తరపున, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నా తల్లి ఆవేదన వెంటనే పట్టించుకుని స్పందించడం గొప్ప విషయమని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీతో మాట్లాడడం జరిగిందని, 48 గంటలలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టి పిల్లలు ఎక్కడ ఉన్నారో ఛేదించడం జరిగిందని చెప్పారు. పిల్లలు క్షేమంగా ఉన్నారని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ ఏ విధంగా పనిచేస్తుందో ఈ ఘటనే నిదర్శనమని పోలీసుల పనితీరును మెచ్చుకుంటూ ధన్యవాదాలు తెలిపారు. నిరుపేదలు, సామాన్యులు ఇటువంటి ఫిర్యాదులు ఇచ్చినప్పుడు ప్రభుత్వం ఎలా పని చేసిందో ఈ కిడ్నాప్ ఘటనని నిదర్శనమన్నారు. పిల్లలు ఇద్దరూ హాస్పిటల్‌లో ఉన్నారని, వారు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కొండేపూడి సూర్యప్రకాష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, బస్సా సత్యనారాయణ, సురవరపు సుబ్బారావు, నల్లా శ్రీను, అల్లవరపు నగేష్, కోరుప్రోలు శ్రీను, మేరుగు భూషణం, వియ్యపు రమణరాజు, బెజవాడ సురేష్, కర్నాసుల రాజా, చొక్కా దావీద్, కొవ్విరి రాంబాబు, ఆగంటి లోవ, వాసంశెట్టి సూరిబాబు, గొడుగుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై గళమెత్తిన గళ్లా మాధవి

- నగర కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం
- నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై మండిపాటు
- మంచినీటి సరఫరా, వీధి దీపాల విషయంలో అధికారులను నిలదీత
- ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని విజ్ఞప్తి

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి పలు ప్రజా సమస్యలపై గళమెత్తి అధికారుల తీరును నిరసించారు. ప్రధానంగా నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ తీరుపై అసహనం వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గళ్లా మాధవి మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌లలో ప్రజా సమస్యలపై, అభివృద్ధిపై చర్చలు జరుగుతుంటే గుంటూరు



కార్పొరేషన్‌లో మాత్రం పారిశుద్ధ్యం గురించి ప్రస్తావన చేయటం బాధాకరంగా ఉందని, అధికారుల తీరు మాత్రం ఆక్షేపణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి రాజధాని అయిన అమరావతిలో భాగమైన గుంటూరు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఇళ్ల వద్ద చెత్త కూడా ఎత్తలేని పరిస్థితిలో మున్సిపల్ అధికారులు ఉండటం దారుణమన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తున్నానని ప్రధానంగా పారిశుద్ధ్యపై ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, నేను సైతం ప్రత్యక్షంగా పారిశుద్ధ్య పనులపై మున్సిల్ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించినప్పటికి ఫలితం లేదని వాపోయారు. సమస్యల పరిష్కారానికి అధికారులు ముందుకు రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, నియోజకవర్గంలో మంచినీటీ సరఫరార సక్రమంగా జరగడం లేదని, అదేవిధంగా పలు సమస్యల గురించి అధికారులను పరిష్కరించమని కోరితే "చేస్తాము చూస్తాము" అని సమాధానం ఇస్తున్నారే తప్పా పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక డివిజన్లో చెత్త వేయడానికి కూడా సరైన బిన్లు లేవని, అలాగే కాలువలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించడానికి అనేక కారణాలు చెబుతున్నారని, ఇలా ప్రతి సమస్యకు కారణాలు చెబితే పరిష్కారం దొరకదు కాబట్టి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన సిబ్బందిని నియమించుకొని పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కమిషనర్‌ను మాధవి కోరారు. పాడైపోయిన వీధి దీపాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని నగరంలో ఇళ్ల మధ్యన మున్సిపల్, ప్రైవేట్ స్థలాల్లో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరిగి, చిట్టడవులను తలపిస్తున్నాయని, ఇందులో విషసర్పాలు చేరి ప్రజలకు హాని గురిచేస్తున్నాయని అన్నారు. నా దృష్టికి వచ్చిన కొన్నిచోట్ల ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని, ప్రైవేట్ స్థలాల యజమానులకు నోటీసులు కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే నగరం ఒక డంపింగ్ యార్డ్ మాదిరిగా మారిపోతుందని మాధవి వ్యాఖ్యానించారు.

# వైసీపీ దొంగల ముఠాలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దు

- సీఎం చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేసిన జీవీ ఆంజనేయులు

వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో 30వేల మంది అమాయక ప్రజల ప్రాణాలు తీసిన వైసీపీ దొంగల ముఠాలో ఏ ఒక్కరినీ ఊరికే వదిలి పెట్టవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. చేసిన నిర్వాకాలు చాలక తప్పుడు ప్రచారాలతో తప్పించుకోవాలని చూస్తున్నారని, ఒక్కొక్కర్ని అరెస్టు చేసి చిప్పకూడు తినిపిస్తే తప్ప అసలు వాస్తవాలు బయటకు రావని నిప్పులు చెరిగారాయన. అయిదేళ్ల వైకాపా పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను మించిన రీతిలో మద్యం అమ్మకాల అక్రమాలు జరి గాయన్నారు. ఈ మేరకు శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో మద్యం అక్రమాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వైకాపా, మాజీ సీఎం జగన్ రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారాయన. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ప్రభుత్వం పాత ప్రభుత్వం పాపాలను ప్రక్షాళన చేయాలి



చూస్తుంటే ఆ బురదను కూటమి ప్రభుత్వం చల్లాలని జగన్ తన సొంత మీడియా, పేటీఎమ్ బ్యాచ్‌లతో అబద్ధపు ప్రచారాలకు పూనుకున్నారని ధ్వజమెత్తారు జీవీ. నాడు ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ మొదట కన్నేసింది మద్యం విధానం, అమ్మకాల్లో అక్రమాలపైనే అన్నారు. వైకాపా అయిదేళ్ల హయాంలో రూ.1.24లక్షల కోట్ల మద్యాన్ని జగన్ నగదురూపంలోనే అమ్మడమే అందుకు నిదర్శమన్నారు జీవీ. రాష్ట్రంలోని డిస్టిలరీలను గుప్పిట్లో పెట్టుకుని ప్రజల గొంతుల్లో విషం పోశారు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సందర్భాల్లో ప్రైవేటు ల్యాబుల్లో చేయించిన పరీక్షల్లోనూ నాడు జగన్ ప్రభుత్వం సరఫరా చేసిన మద్యం ఎంత ప్రమాదకరమైందో ఆధారాలతో సహా నిరూపణ అయిందన్నారు. 2019-24 మధ్య రాష్ట్రవ్యాప్తంగా లివర్లు పాడై ప్రాణాల మీదకు తెచ్చుకున్న బాధితుల దీనగాథలు కూడా జగన్ దారుణాలకు సాక్ష్యమన్నారు జీవీ. జగన్, విజయసాయిరెడ్డి, వాసుదేవరెడ్డి, మిథున్‌రెడ్డి పాపాలు అన్నీఇన్నీ కావని అధికార అండతో డిస్టిలరీలు మొత్తాన్ని గుప్పిట పెట్టుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని, ఎంతోమంది అక్కచెల్లెళ్లమన్న తాళి బొట్లు తెంచి పేదల రక్తపు కూడు తిన్న నీచుల్ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించ వద్దని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు ఎమ్మెల్యే జీవీ. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు. మద్యం విధానంలో మార్పులతో కూసాలు కదులుతాయనే జే-గ్యాంగ్‌లో కలకలం మొదలైందన్నారు. అందుకే చేసిన తప్పులు కప్పిపుచ్చు కోవడానికి సాక్షిలో తప్పుడు కథనాలు వండి వార్చుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు కాళ్లు, కీళ్ల విరగ్గొట్టి మూల కూర్చోబెట్టినా ఇంకా బుద్ధి రాకుంటే ఎలా అని చురకలు వేశారు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు.



# అభివృద్ధి చేసి చూపిస్తా

- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జాతరను తలపిస్తున్న అభివృద్ధి పనులు
- పలు శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): వైసీపీ పాలనలో అభివృద్ధి అనే మాటే ప్రజలు పూర్తిగా మర్చిపోయారని, కానీ మా ప్రభుత్వంలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి పేరుతో శంకుస్థాపనలు, టెంకాయలు కొట్టడమే గానీ ఏపని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం శంకుస్థాపన చేయడంతో పాటు ప్రతి పనిని పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటుందన్నారు. శనివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్, మాగుంట లేఔట్, డి మార్ట్ వద్ద సీసీ రోడ్డు పనులకు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... 21వ డివిజన్ అభివృద్ధికి వచ్చే 2 నెలల్లో 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఆఖరి 16 నెలలు వైసీపీ నాయకులు కొన్ని పనులు ప్రారంభంచేసి మధ్యలోనే ఆపేశారని, కొన్ని పనులు అసలు ప్రారంభమే కాలేదన్నారు. కానీ మా ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన ప్రతి పనిని పూర్తిచేయించే బాధ్యత నేను తీసుకుంటానని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజలు కరెంటు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి... రాబోవు సంవత్సరం రోజుల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కరెంటు సమస్య తలెత్తకుండా ఓ ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తామని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కంటే సాయి బాబా, టీడీపీ నాయకులు చాంద్ భాషా, కోటిరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, మల్లికార్జున, ప్రకాష్, కొండల్‌రావు, రాజేష్, మురళి, శివలక్ష్మి, సుమ, బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, నిఖిల్, కరిముల్లా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు ఎమ్మెల్యే కృషితో ఆర్థిక సాయం మంజూరు

గిద్దలూరు(చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం వివిధ ఘటనల్లో బాధితుల కుటుంబాలకు ఆర్థికసాయం మంజూరుకాగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. బేస్తవారిపేటకు చెందిన



కాలువ మణికంఠ గత ఏడాది సెప్టెంబర్ 22న విద్యుదాఘాతంతో మరణించాడు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడటంతో ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. అర్ధవీడులో విద్యుదాఘాతంతో యందాల రంగస్వామికి చెందిన 2 గేదెలు మృతిచెందగా వారికి రూ.65 వేలు, కాకర్ల గ్రామానికి చెందిన మహబూబ్ పీరాకు చెందిన 13 గొర్రెలు విద్యుదాఘాతంతో మృతిచెందగా వారికి రూ.1.30 లక్షలు, అర్ధవీడు మండలం చింతమల్లెలపాడులో విద్యుదాఘాతంతో బోగం లింగయ్య గేదె మృతిచెందగా రూ.40 వేలు మంజూరు కాగా ఆయా కుటుంబాలకు ఎమ్మెల్యే చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తారని తెలిపారు. చేసిన మేలును ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# బిలోలి కోర్టుకు హాజరైన దేవినేని ఉమ

మహారాష్ట్ర(చైతన్యరథం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010లో బాబ్లీ ప్రాజెక్టు దగ్గర ధర్నా కేసులో మాజీ మంత్రి దేవినేని ఉమ శనివారం మహారాష్ట్రలోని బిలోలి కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ధర్మాబాద్ కోర్టు నాటి మాజీ సీఎం చంద్రబాబు సహా 16 మందికి గతంలోనే నోటీసులు ఇచ్చింది. విచారణలో భాగంగా దేవినేని ఉమతో పాటు తెలంగాణ ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, హనుమంత్ షిండే కోర్టుకు హాజరయ్యారు.



# అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో సంతోషంలో ప్రజలు

◆ **12వ డివిజన్‌లో పర్యటించిన**

**ఎమ్మెల్యే గద్దె రామమోహన్**



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేసి అద్భుతాలు సృష్టించనున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయదంతో పాటుగా అమరావతిని అభివృద్ధి చేస్తారని చెప్పారు. శనివారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ అయ్యప్ప నగర్ ట్రెజరీ ఎంప్లాయిస్ కాలనీ ఏరియాలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించి స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... అన్న క్యాంటీన్లను ప్రారంభించడంతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను రద్దు చేసిన తర్వాత అన్న క్యాంటీన్ల విలువ, అవసరం ప్రజలకు బాగా తెలిసిందన్నారు. కూలీలు, పేదలు, ఆటో డ్రైవర్లకు అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. రోజుకు పదిహేను రూపాయలతో ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం పూర్తి అవుతున్నాయని, మిగిలిన డబ్బులను కుటుంబ అభివృద్ధికి కూలీలు ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని చెప్పారు. అన్న క్యాంటీన్లలో పూటకు రూ.5తో భోజనం పెట్టి విధానాన్ని కూడా కొంత మంది వైసీపీ వారు సోషల్ మీడియాలో విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నెలకు రూ.450లతో చంద్రబాబునాయుడు పేదలకు నెలంతా ఆకలిని తీరుస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత చంద్రబాబునాయుడు చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకున్నారని, అందువల్లనే 2024లో జరిగిన ఎన్నికల్లో జగన్ కు బుద్ధి చెప్పి చంద్రబాబునాయుడుకు అధికారం అప్పగించారన్నారు. జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో 11 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు. జగన్, చంద్రబాబు పాలనను చూసిన ప్రజలు ఇద్దరిలో చంద్రబాబునాయుడు పాలనే తమకు కావాలని ప్రజలు నిర్ణయించుకుని జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేశారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క సారిగా రూ.3వేలు ఉన్న పింఛను రూ.4 వేలకు పెంచారని చెప్పారు. గతంలో రూ.2 వేలు ఉన్న పింఛను రూ.3 వేలు చేయడానికి జగన్‌కు ఐదు సంవత్సరాలు పట్టిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావడం చూసి చాలా విదేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు స్థాపించడానికి ఆసక్తి కనబరుస్తున్నారని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటుగా అమరావతిని అభివృద్ధి చేసి చూపిస్తారని చెప్పారు. చంద్రబాబు నాయుడు చేసే ప్రతి పనిని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని రామమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నడకుదిటి సూర్యనారాయణ, మోటూరి బుచ్చిబాబు, పఠాన్ హయ్యాన్, కొండవీటి లక్ష్మీప్రసాద్, యలమంచలి రవీంద్ర, కోడే సాంబశివరావు, యలమద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను అణచివేసిందే జగన్:ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్రంలో సివిల్ సర్వీస్ అధికారుల పేరిట వైకాపా, జగన్ దొంగ డ్రామాలు మొదలు పెట్టారని తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేసే ప్రయత్నం చేస్తోన్న మాజీ జగన్ రెడ్డి హయాంలోనే నిజానికి అఖిల భారత సర్వీసుల అధికారులను దారుణమైన స్థితిలో అణచివేతకు గురి చేశారని మండిపడ్డారాయన. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో తీవ్రంగా వివాదస్పదమై, ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టడంపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని శనివారం ప్రత్తిపాటి పత్రికా ప్రకటనలో ఆక్షేపణ వ్యక్తం చేశారు.



ఇప్పుడు ఇన్ని ధర్మ పన్నాలు చెబుతున్న జగన్, వైసీపీ వాళ్లు నాటి సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం విషయంలో ఏం చేశారో గుర్తులేదా? అని ప్రశ్నించారు. సీనియర్ మోస్ట్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఐదేళ్ల పాటు పోస్టింగ్ ఇవ్వకుండా ఎలా వేధించింది... సస్పెన్షల మీద సస్పెన్షన్ల తో ఎలా ఎలా ఇబ్బంది పెట్టింది మరిచిపోయారా అని గుర్తుచేశారు. అంతేకాక సివిల్స్ అధికారుల సర్వీస్ రిజిస్టర్లు జగన్ వద్దే పెట్టుకుని వేధించారని ఆరోపించారు. ఒక ఎంపీని లాకప్‌లో హింసించిన అధికారులపై చర్యలు తీసుకోకూడదా? అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో చేసిన తప్పులపై వారే సిగ్గుతో తల దించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ కర్తవ్యమని పుల్లారావు స్పష్టం చేశారు.

# పేదవాడి ఆకలికి ఫుల్‌స్టాప్

❑**వైసీపీ పాలనలో అన్నమో రామచంద్రా అంటూ**

**అలమటించిన అభాగ్యజీవులు**

❑**అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంతో నిండనున్న పేదవాడి డొక్కలు**

❑**గుంటూరులో అన్న క్యాంటీన్ వద్ద పేదలకు భోజనం వడ్డించిన**

**మన్నవ మోహనకృష్ణ**

గుంటూరు (చైతన్యరథం): 'పంచభక్ష పరమాన్నాలు లేకపోయినా ఫర్వాలేదు, కాలే కడుపునకు పట్టెడు పచ్చడి మెతుకులు దొరికితే చాలు.. పరమానందం కలుగుతుంది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే అన్నదానం. అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అన్నది లోకోక్తి. ఏది దానమిచ్చినా కలగని తృప్తి.. అన్నం తిన్నవారు మాత్రం కడుపు నిండాక పొందే సంతృప్తి మాటల్లో వర్ణించలేనిది' అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. శనివారం గుంటూరులోని ఆర్టీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించి పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం మోహనకృష్ణ మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో 'అన్నమో రామచంద్రా' అని ఎంతో మంది అభాగ్యజీవులు అలమటించిపోయారని ఇకపై వారి ఆకలికి ఫుల్ స్టాప్ పడిందన్నారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పునః ప్రారంభించడం సంతోషంగా ఉందని, రూ.15 లకే మూడుపూట్ల కడుపు నింపుకునే మహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. నాడు జగన్ సీఎం అయ్యాక అన్నకాంటీన్లు రద్దు చేశారని, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను రద్దు చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోతారని మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు హొటల్‌కు వెళ్లి భోజనం చేయాలంటే రూ.80 నుంచి రూ.100 ఖర్చవుతోందని ఇటువంటి సమయంలో కార్మికులు, పేదలకు అతి తక్కువ ధరకే కడుపు నింపుకునే అవకాశం లభించిందన్నారు. అన్నదానం అవశ్యకతను టీడీపీ పార్టీయే గుర్తించిందని, మొట్టమొదటిగా నందమూరి తారకరామారావు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉచిత అన్నదానం ప్రారంభించి భక్తుల ఆకలి తీర్చారన్నారు. దానిని స్ఫూర్తిగా తీసుకుని చంద్రబాబునాయుడు గత ప్రభుత్వంలో కనదుర్గమ్మ గుడిలో ఉచిత అన్నదానాన్ని ప్రారంభించారని, తర్వాత కార్మికులకు, పేదవారికి తక్కువ ధరకే భోజనం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించారన్నారు. పేదలకు ఉపాధి దూరం చేసి, తక్కువ ఖర్చుతో ప్రభుత్వం ద్వారా లభ్యమయ్యే భోజనాన్ని రద్దు చేసి జగన్ పేదల ఉసురు కట్టుకున్నారని మోహనకృష్ణ పేర్కొన్నారు. ఇకపై పేదలు భోజనం కోసం అవస్థలు పడాల్సిన అవసరం లేదని మోహనకృష్ణ స్పష్టం చేశారు.



# కష్టకాలంలో వెన్నంటి ఉన్న జర్నలిస్టులను మరువను

●**పెనుకొండలో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి కృషి**

●**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం చర్యలు**

●**చేనేత, జౌళి, బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మ**

పెనుగొండ(చైతన్యరథం): కష్టకాలంలో వెంట నడిచిన జర్నలిస్టులను ఎప్పటికీ మరువనని, ఏ కష్టం వచ్చినా వెంట ఉంటానని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో శనివారం జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం పెనుగొండలో ప్రెస్‌క్లబ్ నిర్మిస్తామని చెప్పారు. ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, జర్నలిస్టుల పిల్లలకు స్కూలు ఫీజుల్లో రాయితీపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అనంతరం వారికి ఆత్మీయ విందు ఇచ్చి గిఫ్ట్ బాక్సులు అందజేశారు.



# అధికారుల తీరు మార్చుకోకపోవడం దారుణం

❑ **దగ్ధమైన పత్రాలను పరిశీలించిన**

**గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

ధవలేశ్వరం (చైతన్యరథం): పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆఫీస్ లోని కొన్ని రికార్డులు దగ్ధం చేశారనే సమాచారం తెలుసుకున్న రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ కి, ఎస్పీకి సమాచారం తెలియజేసి ఆయన అక్కున్న సిబ్బందిని విచారించారు. అనంతరం దగ్ధమైన ప్రదేశంలో కొన్ని దస్త్రాలను పరిశీలన చేశారు. ఆ సందర్భంగా గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ...



ఇటీవల మదనపల్లిలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్నిచోట్ల అధికారుల తీరు మార్చుకోవడం లేదని, గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు వివిధ వ్యవస్థల్లో పాతుకుపోయి ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఘటనపై వెంటనే పూర్తి విచారణ చేయలని, దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని రికార్డులు దగ్ధం చేయడానికి ఏమైనా అనుమతులు తీసుకున్నారా? లేదా అనేదానిపై పూర్తి విచారణ చేయాలన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ సంబంధించిన అన్ని రికార్డులు సరిగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించాలని, దగ్ధమౌతున్న సమయంలో కార్యాలయ స్వీపర్ అందుబాటులో లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం ఎం.పీ.పీ వెలుగుబంటి ప్రసాద్, కడియం మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, పందూరి అప్పారావు, పెన్మెంటి ఏకబాబు, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, దొడ్డి బాబ్జి, నాళ్ల రమేష్, ఆళ్ల విటల్, కరణం రామారావు, కొడమంచిలి సూర్య, కింతాడ శివశంకర్, పలివేల వినోద్, తలారి రాజు, పోలిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.